**న్యూస్‌టుడే ఇంటర్వ్యూ** | ఆర్ఎల్‌పీ సెక్యూరిటీస్ ఎండీ డాక్టర్ ఆర్.ఎం.సి.వి. ప్రసాదరావు

# రెండేళ్లలో మళ్లీ 15000కు



50000కు సెన్సెక్స్. ఇది సాధ్యమేనా? కనీసం ఇప్పటి పరిస్థితుల్లో ఇలాంటి ఆలోచన ఎవరికైనా వస్తుందా? ఎనిమిదేళ్లు ఓపిక పడితే సాధ్యమేనంటున్నారు హైదరాబాద్‌లోని స్టాక్ బ్రోకింగ్ కంపెనీ ఆర్ఎల్‌పీ సెక్యూరిటీస్ ఎండీ డాక్టర్ ఆర్.ఎం.సి.వి. ప్రసాదరావు. అసోసియేషన్ ఆఫ్ నేషనల్ ఎక్స్ఛేంజెస్ ఆంధ్రప్రదేశ్ విభాగానికి ఈయన ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ప్రసాదరావు... రెండేళ్లలో స్టాక్ మార్కెట్ బాగా కోలుకుంటుందని, ఆ తర్వాత అత్యున్నత శిఖరాలకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. మార్కెట్లో దిద్దుబాటు చాలా వరకూ పూర్తయిందనేది ఈయన ఉద్దేశం. ఆకర్షణీయమైన ధరలో లభ్యమవుతున్న నాణ్యమైన షేర్లను కొనుగోలు చేసేందుకు మదుపుదార్లు ముందుకు రావచ్చని అంటున్నారు. 'న్యూస్‌టుడే'కిచ్చిన ఇంటర్వ్యూలో స్టాక్ మార్కెట్ తీరుతెన్నులపై ప్రసాదరావు విశ్లేషణ ఇదీ...

- దాదాపు దిద్దుబాటు పూర్తయింది
- మార్కెట్ 7000కు మించి పడకపోవచ్చు
- రెండేళ్లలో కోలుకుంటుంది
- విద్యుత్, టెలికామ్ రంగాలు మెరుగు

**న్యూస్‌టుడే: స్టాక్ మార్కెట్‌కు ఈ కష్టకాలం ఇంకెన్నాళ్లు**

**ప్రసాదరావు:** నా దృష్టిలో 80 శాతం దిద్దుబాటు పూర్తయింది. ఇంకా ఏమైనా ఉందంటే అది నామమాత్రమే. కాకపోతే స్థిరపడి తిరిగి పైకి దూసుకెళ్లడానికి కొంత సమయం పడుతుంది.

**న్యూ: స్వల్ప, మధ్యకాలానికి మార్కెట్ తీరుతెన్నులు ఎలా ఉండొచ్చు**

**ప్ర:** కొన్నాళ్లపాటు అనిశ్చితి తప్పదు. పార్లమెంటు ఎన్నికలు అయ్యేవరకూ ఎదురుచూడాలి. ఆ తర్వాత కేంద్రంలో స్థిరత్వంతో కూడిన ప్రభుత్వం ఏర్పడి సానుకూల విధానాలను అమలు చేస్తే స్టాక్ మార్కెట్ తిరిగి జవజీవాలు సంతరించుకుంటుంది.

**న్యూ: సెన్సెక్స్‌కు అథమ స్థాయి ఎక్కడ? ఒకవేళ కోలుకుంటే ఎక్కడివరకూ పెరిగే అవకాశం ఉంది**

**ప్ర:** కనిష్ఠంగా 7000 పాయింట్ల కంటే పడకపోవచ్చునని అనిపిస్తోంది. కింది స్థాయిల్లో కొనుగోళ్ల మద్దతు వస్తున్నట్లు కనిపిస్తూనే ఉంది. ఒకవేళ మార్కెట్ గణనీయంగా కోలుకుంటే సెన్సెక్స్ 12000 పాయింట్ల వరకూ వెళ్లవచ్చు. ఆతర్వాత ఏడాది నుంచి రెండేళ్ల వ్యవధిలో 15000 వరకూ పెరుగుతుందనే విశ్వాసం మాకు ఉంది.

## మార్కెట్ విశ్లేషణ

**న్యూ: ఒకవేళ కోలుకునే పరిస్థితే వస్తే ఏయే రంగాల్లోని షేర్లు అధికంగా లాభపడతాయి**

**ప్ర:** విద్యుత్తు, టెలికామ్ రంగాల్లోని కంపెనీలు మెరుగు. కొత్త పెట్టుబడుల భారం లేని, అప్పులు లేని, ఆదాయాల్లో వృద్ధి ఉన్న కంపెనీలు మదుపుదార్లను ఆకర్షిస్తాయి.

**న్యూ: స్టాక్ మార్కెట్ గతంలో నమోదు చేసిన గరిష్ఠ స్థాయిని మళ్లీ అధిగమించడానికి ఎంత సమయం పట్టొచ్చు**

**ప్ర:** మూడేళ్లు. మీకో ఆసక్తికరమైన విషయం చెబుతాను. వచ్చే ఎనిమిదేళ్లలో... అంటే 2016 నాటికి సెన్సెక్స్ 50000 స్థాయిని అందుకుంటుంది. ఇది కేవలం గాలివాటం అంచనా కాదు. గత పదహారేళ్లుగా స్టాక్ మార్కెట్ గమనాన్ని, సెన్సెక్స్ ఈపీఎస్‌ను పరిగణనలోకి తీసుకొని చేసిన లెక్క ఇది. 1988లో సెన్సెక్స్ షేర్ల ఈపీఎస్ రూ.40. 1992 నాటికి ఇది రెట్టింపై రూ.80కి చేరింది. 2000లో 200 రూపాయలు. 2008లో రూ.800. దీని ప్రకారం చూస్తే సెన్సెక్స్ షేర్ల ఈపీఎస్ గణనీయంగా పెరుగుతుందని అంచనా. మన జీడీపీ వచ్చే ఎనిమిదేళ్లలో సగటున 7-8 శాతం వృద్ధి చెందుతుందని భావిస్తే, పారిశ్రామికాభివృద్ధి దానికి రెట్టింపుగా అంటే 15 శాతం ఉంటుంది. ఈ లెక్కల్నిబట్టి 2016 నాటికి సెన్సెక్స్ షేర్ల ఈపీఎస్ రూ.2000 వరకూ ఉండాలి. దీన్ని 25 పీఈ (ప్రైస్ ఎర్నింగ్) ప్రకారం లెక్కిస్తే 50000 సెన్సెక్స్ వస్తుంది. నమ్మదగినదిగా లేకపోయినా ఇది జరిగేందుకు అవకాశాలు హెచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ముసిరినందున ఏడాదిన్నర, రెండేళ్ల పాటు కంపెనీల ఆదాయాల్లో పెద్దగా వృద్ధి ఉండకపోవచ్చు. కాస్త తగ్గేందుకూ అవకాశం ఉంది. ఒకసారి ఈ గండాన్ని గట్టెక్కాక మళ్లీ కొంతకాలం వెనుదిరిగి చూడాల్సిన పని ఉండదు.

**న్యూ: మీ వద్దకు వచ్చే మదుపుదార్లకు మీరిస్తున్న సలహా**

**ప్ర:** నాణ్యమైన షేర్లు కొనుగోలు చేయమనే చెబుతున్నాను. షేర్లను అత్యధిక ధరలో అమ్మడం, అతి తక్కువ ధరలో కొనడం ఎవరివల్లా కాదు. కాబట్టి నాణ్యమైన షేర్లను ఎంపిక చేసుకొని పతనం పూర్తయినట్లు అనిపిస్తే దీర్ఘకాలానికి కొనుగోలు చేయవచ్చు.

**న్యూ: ఈపరిస్థితుల్లో షేర్ల కంటే బంగారం, స్థిరాస్తుల్లో పెట్టుబడులు మేలని మీరు భావిస్తున్నారా**

**ప్ర:** ఎక్కువ ప్రతిఫలం కావాలంటే ఈక్విటీ పెట్టుబడులే మేలు. నావరకూ నేను పెట్టుబడులన్నీ స్టాక్ మార్కెట్లోనే పెడతాను. వేరే రకాలకు చెందిన ఆస్తులపై ఆసక్తి చూపను. దీర్ఘకాలంలో ఈక్విటీ పెట్టుబడుల నుంచి వచ్చే ప్రతిఫలంతో ఏదీ సరితూగదు.

**న్యూ: ప్రభుత్వ పరంగా, ఇతరత్రా ఎటువంటి చర్యలు స్టాక్ మార్కెట్లో విశ్వాసాన్ని కలిగిస్తాయి**

**ప్ర:** పెట్టుబడులు పెంచి డిమాండ్ సృష్టించాలి. మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు, వ్యవసాయ రంగానికి అధికంగా నిధులు కేటాయించాలి. నగదు లభ్యత పెంపొందించే చర్యలతో పాటు రుణాలపై వడ్డీ రేట్లు 10% కంటే దిగువకు తగ్గించే చర్యలు అవసరం.

– న్యూస్‌టుడే, హైదరాబాద్